పడకేసిన రూర్బన్ పథకం!


నిలిచిపోయిన ఆడిటోరియం పనులు


కరన్‌కోట్‌లో నిలిచిపోయిన పశువైద్యశాల భవన నిర్మాణం

- 2018లో అల్లాపూర్(ఎస్)క్లస్టర్ ఎంపిక
- ఇప్పటికీ పూర్తికాని పనులు
- కలెక్టర్ చొరవ చూపాలని కోరుతున్న ప్రజలు

తాండూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'శ్యాంప్రసాద్ ముఖర్జి (రూర్బన్) పథకం' ప్రవేశ పెట్టింది. 2018లో తాండూరు మండలంలోని అల్లాపూర్(ఎస్)క్లస్టర్‌ను ఎంపిక చేశారు. ఈ క్లస్టర్ పరిధిలోని 33 గ్రామాల్లో పట్టణ వసతులు కల్పించాలనే ఉద్దేశంతో రూర్బన్ పథకం ద్వారా రూ.15 కోట్ల నిధులు కూడా మంజూరు చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటా ప్రకారం అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు.

ఉద్దేశం మంచిదే.. ఆచరణ శూన్యం

రూర్బన్ పథకం ఉద్దేశం మంచిదే అయినా ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. పల్లెల్లో విద్యా, వైద్యం మెరుగుపడాలని సంకల్పించారు. అయితే, జిల్లాల పునర్విభజనలో భాగంగా కొత్తగా వచ్చిన అప్పటి జిల్లా కలెక్టర్ దివ్య ప్రతి నెల రూర్బన్ పథకంపై సమీక్షా సమావేశం నిర్వహించి పనులు పూర్తి అయ్యేలా చూశారు.

మధ్యలో నిలిచిపోయిన పనులు

రూర్బన్ కింద తాండూరు మండలానికి 165 పనులకు రూ.15 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటివరకు 156 పనులు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అవి అసంపూర్తిగా మిగిలిపోయాయి. ప్రతి ఊరిలో గ్రామ పంచాయతీ భవనం, పీహెచ్‌సీ, పశువైద్యశాల భవనం, మీసేవా, పాఠశాల అదనపు తరగతి గదులు, పాఠశాలల్లో సోలార్ లైట్లు, మరుగుదొడ్ల నిర్వహణ, గోదాం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కొన్ని పూర్తయినా వినియోగంలోకి రావడం లేదు.

రూ. 4కోట్లతో ఆడిటోరియం.. ఇండోర్ స్టేడియం పనులు

అంతారం శివారులోని గుట్టపైన ఆడిటోరియం నిర్మాణానికి రూ.2 కోట్లు, ఇండోర్ స్టేడియానికి రూ.2 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని మధ్యలోనే నిలిపివేశాడు. దాదాపు రెండు సంవత్సరాలైన కూడా పనుల్లో పురోగతి లేదు.

కలెక్టర్ స్పందించాలి..

పథకంపై జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించాలని స్థానికులు కోరుతున్నారు పనులు కొన్ని పూర్తయిన ప్రారంభానికి నోచుకోవడం లేదని .. మరి కొన్ని అసంపూర్తిగా ఉన్నాయని తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వెంటనే సమీక్షా నిర్వహించి రూర్బన్ పథకం పనులు వేగవంతం చేసేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

> **డిసెంబర్‌లోపు పూర్తి చేస్తాం**
>
> రూర్బన్ పథకానికి సంబంధించిన నిధులు లేకపోవడంతో పనులు మధ్యలో ఆగిపోయాయి. ఆడిటోరియం పనులకు సంబంధించి నిధులు వచ్చాయి. వెంటనే పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌ను ఆదేశిస్తాం. డిసెంబర్ వరకు పనులన్నీ పూర్తి చేస్తాం.
>
> – వెంకట్రావ్, డీఈ, పంచాయతీరాజ్ విభాగం, తాండూరు

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గండీడ్ మండలం కపులపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం టీఆర్‌ఆర్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం కేసీఆర్ అవలంబిస్తున్న తీరు సొంత పార్టీలోనే నాయకులు నమ్మే ప్రసక్తే లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి 10 సంవత్సరాలైన సరిపోలేదన్నారు. బీఆర్‌ఎస్‌లో అవమానాలు ఎదుర్కోలేక పార్టీలో ఇమడలేక ఎంతో మంది సతమతమవుతున్నారని అన్నారు. ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. పార్టీ అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆశన్న, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, సీనియర్ నాయకులు చిన్న నర్సింలు, జగన్, వెంకటేష్, ఊమొగులయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

మర్పల్లి: మండలంలోని బూచన్‌పల్లి అనుబంధ గ్రామమైన జాజుగుబ్బడి గిరిజన తండాకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, బూచన్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో సుభాష్, మాన్‌సింగ్, దేవదాస్, అనిల్, గురునాథ్, కిషన్, బాలు, అరవింద్, రాందేవ్‌తో మరికొందరు చేరారు. కార్యక్రమంలో బూచన్‌పల్లి మాజీ సర్పంచ్ టోప్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు గూడెం మల్లేశ్‌యాదవ్, బలవంత్‌రెడ్డి, ఎల్ ప్రభాకర్‌రెడ్డి, బిచ్చిరెడ్డి, బక్కారెడ్డి, రెడ్యానాయక్ ఉన్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రసాద్‌కుమార్

క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ


కౌన్సిలర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కొడంగల్ : కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్‌ను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ప్రభాకర్ గౌడ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆస్పత్రిలో మెరుగైన చికిత్స చేయించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఏదైనా అవసరం ఉంటే తనను సంప్రదించాలన్నారు. ఎమ్మెల్యే వెంట రెండో వార్డు కౌన్సిలర్ మధుయాదవ్, బొంరాస్‌పేట పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులను సన్మానిస్తున్న ధారాసింగ్

పెద్దేముల్: క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శననిస్తూ రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్ అన్నారు. మూడు రోజుల క్రితం ఏర్పాటు చేసిన పట్నం రాజేందర్‌రెడ్డి(పీఎంఆర్) క్రికెట్ టోర్నమెంట్‌లో పెద్దేముల్ క్రీడాకారులు గెలిచి రూ.2.5లక్షల నగదు బహుమతి సాధించారు. ఈ సదర్భంగా ధారాసింగ్, కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, మైనార్టీ సెల్ కన్వీనర్ రియాజ్ క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. క్రీడాకారులకు తమ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రమేశ్‌కుమార్, నాయకులు ఎల్లారెడ్డి, ప్రవీణ్ కుమార్, నర్సింలు, గోపాల్, రాజు, చందుతో తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సహకారంతో పేదలకు మెరుగైన వైద్యం

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నందు


సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నందు

బంట్వారం: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్ల నందు అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని మాలసోమారం గ్రామానికి చెందిన గజ్జాడ లక్ష్మికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన చెక్కును వికారాబాద్‌లోని తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులంతా ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

యాలాల: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షేమంగా బయటపడ్డ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పేరుపై ఆదివారం వివిధ ఆలయాల్లో, దర్గాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జంటుపల్లి రామస్వామి, ఎంపీపీ బాలేశ్వర్‌గుప్త, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్షేమంగా బయటపడడం ప్రజల ఆశీస్సుల వల్లేనని వారు పేర్కొన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో సర్పంచ్‌లు,ఎంపీటీసీలు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు.

పెద్దేముల్‌లో..

పెద్దేమూల్: కారు ప్రమాదం నుంచి ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి క్షేమంగా తిరిగి రావడంతో ఆదివారం మండలంలోని మంబాపూర్, పెద్దేముల్, నాగులపల్లి, కందనెల్లి ,మారేపల్లితండాతో పాటు పలు గ్రామాల్లో నాయకులు ఆంజనేయ, గ్రామదేవత, శంభులింగేశ్వర శివాలయాలతో పాటు మజీదు, చర్చిల్లో నాయకులు, అభిమానులు ప్రత్యేక పూజలు చేశారు. 101 కొబ్బరి కాయలు కొట్టారు. దేవుడి ఆశీస్సులు ఎమ్మెల్యేకు ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

యాలాల: మండలంలోని బాగాయిపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బిచ్చరెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తండ్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు విఠల్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పగిడియాల ఎంపీటీసీ ప్రభాకర్ బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు అడిగినన్ని నిధులు

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి


సునీతారెడ్డిని కలిసిన సర్పంచ్‌లు

బంట్వారం: అభివృద్ధి పనులకు అడిగినన్ని నిధులు మంజూరు చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. బంట్వారం మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు ఆదివారం నగరంలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ప్రస్తుతానికి బంట్వారం, మాలసోమారం, తొర్మామిడి గ్రామాలకు జెడ్పీ నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీల్లో అవసరమైన పనులను గుర్తించి ఎస్టిమేట్ వేయిస్తే జిల్లా పరిషత్ ద్వారా నిధులు ఇస్తానన్నారు. ఇప్పటికే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, అంగన్‌వాడీ భవనాలు ,ప్రహరీలు పెద్ద ఎత్తున నిర్మించినట్లు ఆమె చెప్పారు. రైతులు ముందుకు వస్తే పొలాలకు ఫార్మేషన్ రోడ్లు వేయిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బంట్వారం ,తొర్మామిడి , మాలసోమారం సర్పంచ్‌లు లావణ్య, స్ఫూర్తి ,నర్సింహరెడ్డి , కురమ సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, జాగృతి నాయకుడు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

జోరుగా బెల్టుషాపులు

తాండూరు రూరల్: మండలంలో బెల్టుషాపులు జోరుగా కొనసాగుతున్నాయి. మల్కాపూర్, సంగెం కలాన్, కోత్లాపూర్, కోటబాసుపల్లి, ఐనెల్లి, జినుగుర్తి గేటు, గుంతబాసుపల్లి, మిట్టబాసుపల్లితో పాటు ఐసీఎల్ ఫ్యాక్టరీ గేటు వద్ద బెల్టుషాపుల్లో మద్యం అమ్మకాలు జరుపుతున్నారు. అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహణ వల్ల తాగిన మైకంలో గొడవలు, దొంగతనాలు జరుగుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ సమస్యలపై దృష్టి పెట్టండి

పరిగి: కాలనీలోని సమస్యలు వెంటనే పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు కిషన్‌నాయక్ అన్నారు. పట్టణ కేంద్రంలోని 3వ వార్డు కాలనీవాసులు ఆదివారం సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని కాలనీవాసులు ఆరోపించారు. కాలనీలో నీటి సమస్యను పరిష్కరిస్తామని బోరు మోటారును పడగొట్టి, ట్యాంకును కూల్చివేసి సంవత్సరం గడుస్తున్నా ఇప్పటికి పూర్తి కాలేదని వాపోయారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కౌశిక్‌రెడ్డిని పదవి నుంచి బర్తరఫ్ చేయాలి


తాండూరు: కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

తాండూరు: ముదిరాజ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని సీఎం కేసీఆర్ వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ముదిరాజ్ సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు లొంకా నర్సింహులు డిమాండ్ చేశారు. ఆదివారం కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలో బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్‌తో పాటు నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్పీ రవికాంత్,,ముదిరాజ్ సంఘం నాయకులు, కులస్తులు నిరసన వ్యక్తం చేశారు. అనంతనం కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కౌశిక్‌రెడ్డి ఎత్తు పెరిగారని బుద్ధి మాత్రం పెరగలేదన్నారు. ముదిరాజ్ కులస్తులపై అకారణంగా అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ముదిరాజ్ కులస్తులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రతినిధులు హన్మంతు, జర్నప్ప, లక్ష్మణ్, రాము, జగదీష్, తిరుపతి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్ అర్బన్: ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డిని వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని వికారాబాద్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ముదిరాజ్ విలేకరిపై దాడికి నిరసనగా ఆదివారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. హుజురాబాద్‌లో ముదిరాజ్ విలేకరిపై కౌశిక్‌రెడ్డి దాడి చేయడంతో పాటు బూతులు తిట్టడం దారుణమన్నారు. ఆయన దాడిని పోలీసులు సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు నర్సింలు, పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, లక్ష్మణ్, లాలయ్య, శివరాజ్, బాలముకుందం, వెంకటయ్య పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల జోలికి వస్తే సహించం

పరిగి: ముదిరాజ్‌లపై కౌశిక్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యాలు చేయడం సరికాదని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదుట కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అజయ్ అనే యువకుడిని కిడ్నాప్ చేసి ఇష్టానుసారంగా కొట్టి దూషిస్తూ మాట్లాడడం ఎంత వరకు సమంజసమని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షుడు రాంచంద్రయ్య, హన్మంతు ముదిరాజ్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.

యూత్ డిక్లరేషన్‌ను 100 శాతం అమలు చేస్తాం

పీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీశ్

నవాబుపేట: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌ను 100 శాతం అమలు చేసి నిరూపిస్తామని పీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీశ్ పేర్కొన్నారు. మండలంలోని చించల్‌పేటలో ఆదివారం ఇంటింటికి కాంగ్రెస్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తే కచ్చితంగా అమలు చేస్తుందన్నారు. గత ఎన్నికల్లో సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అధికారంలోకి రాగానే నెరవేరుస్తామన్నారు.కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ సమన్వయకర్త చింపుల సత్యనారాయణ రెడ్డి, సీనియర్ నాయకులు జనార్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వసంతం, దర్శన్, భీంభరత్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్‌పటేల్


పూడూరు: మన్నేగూడలో బీజేపీ ఇంటింటి ప్రచారం

పూడూరు: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్‌పటేల్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని మన్నెగూడలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిదులు కేటాయిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం తామే ఇస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా పంచాయతీలకు ట్రాక్టర్లు, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికలు, మరుగుదొడ్లు, మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్, రైతులకు ఏడాదికి రూ.6వేల పెట్టుబడి సాయం, ముద్ర రుణాలు, ఆహార భద్రతలో రేషన్ బియ్యం అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు యూసూఫ్‌ఖాన్, నాయకులు శ్రీనివాస్,రాజు, రమేశ్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన


ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీమహిళలు

బొంరాస్‌పేట: కొత్తగా ఏర్పడిన దుద్యాల మండల కేంద్రంలోని దుద్యాలలో నిత్యం తాగునీటికి అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారని ఆదివారం మహిళలు ఆందోళనకు దిగారు. దుద్యాలలోని 11వ వార్డులో రెండు నెలలుగా మిషన్ భగీరథ నీరు సరఫరా లేకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని కాలనీ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీలో భగీరథ నీటి కోసం భగీరథ ప్రయత్నం చేయాలా అని ప్రశ్నించారు. నీటికోసం పక్కకాలనీలకు వెళ్లి తెచ్చుకుంటున్నామని వాపోయారు. ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. కాలనీవాసులు అనిత, శ్రీనివాస్, పుష్ప, సువర్ణ, జనార్ధన్, అనూష, అంజిలమ్మ, పద్మమ్మ, చంద్రయ్య, శారదమ్మ తదితరులున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత


ఆర్థిక సహాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కుల్కచర్ల : ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి తాము అండగా ఉంటామని పూర్వ విద్యార్థులు శేఖర్, అంజి, అంజిలయ్య అన్నారు. ఆదివారం మండలంలోని సాలీ వ్డ్ గ్రామానికి చెందిన చీపిరి శ్రీను అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న 1998–99 పూర్వ విద్యార్థులు మృతి చెందిన స్నేహితుడి కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్ల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల : గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కామునిపల్లిలో సీడీపీ నిధులతో ఫార్మేషన్ రోడ్డును సర్పంచ్ మహిపాల్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నిధులను కేటాయించి రోడ్ల రూపురేఖలు మార్చాలని చెబుతున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో రోడ్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజిలయ్య, నాయకులు పాల్గొన్నారు.

జీవితంలో స్నేహితుల పాత్ర కీలకం

డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి


సమ్మేళనంలో పాల్గొన్న మనోహర్ రెడ్డి, పూర్వవిద్యార్థులు

కుల్కచర్ల : ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుల పాత్ర ఎంతో కీలకమని డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని విజయచంద్ర ఫక్షన్‌హాల్‌లో 1983–84 పదొవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్నేహితులనుద్దేశించి మాట్లాడారు. సమాజంలో స్నేహితుల విలువ చాలా గొప్పదని, ప్రతి ఒక్కరూ స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. తొటి స్నేహితులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ఆదుకునేందుకు ముందుండాలని తెలిపారు. 40 సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఒకచోట కలవడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో నాయకులు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధారాళంగా చదువుదాం!

- ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి పఠనోత్సవం
- 1నుంచి 10వ తరగతి వరకు అమలు


చదువుతున్న విద్యార్థులు

బొంరాస్‌పేట: విద్యార్థులు ధారాళంగా చదవడం అలవాటుగా చేసుకొని స్వతంత్ర పాఠకులుగా ఎదగాలనే ప్రధాన లక్ష్యంతో ప్రభుత్వం పఠనోత్సవాన్ని (రీడింగ్ క్యాంపెయిన్) అమలులోకి తెచ్చింది. పాఠశాల స్థాయిలో ఉపాధ్యాయులందరూ కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంది. ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాలి. తొలిమెట్టు కార్యక్రమం మరింత సఫలీకృతం అయ్యేందుకు పఠనోత్సవం దోహదపడుతుందని విద్యాధికారులు అభిప్రాయపడుతున్నారు.

ప్రతిరోజు ఒక పీరియడ్

- ▲ పాఠశాల గ్రంథాలయంలో ప్రతిరోజు ఒక పీరియడ్ కేటాయించి చదవాల్సి ఉంటుంది.
- ▲ ప్రతి ఉపాధ్యాయులు తన సబ్జెక్టును 10నిమిషాలు బాహ్య పఠనం చేయించాలని ఉంది.
- ▲ చార్టులు లేదా నల్లబల్లలపై పదాలను రాసి ప్రదర్శించి చదివించాలి.
- ▲ గ్రంథాలయ పీరియడ్‌లో కథల పుస్తకాల పఠనానికి సమయం కేటాయించాలి.
- ▲ ఇంటి వద్ద పుస్తక పఠనం చేసేలా చర్యలు తీసుకోవాలి. తల్లిదండ్రులకు చదివి వినిపించాలి
- ▲ మూడు రోజులు మాతృభాష, మరో మూడు రోజులు ఆంగ్ల భాష పఠనం ఉంటుంది.

నేటి నుంచి అమలు

విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి (సోమవారం) జూలై 31వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1నుంచి 10వ తరగతి వరకు అమలు ఉంటుంది.జూలై 10 నుంచి 15 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించాలి. ముగింపు రోజు తల్లిదండ్రులు, ప్రముఖులతో సమావేశం నిర్వహించి అభినందించాలి.

1.ధారాళంగా చదివేవారు, 2.ఆగి ఆగి చదివేవారు లేదా ధారాళంగా చదవలేనివారు, 3. అసలు చదవలేనివారుగా విభజించాలి. వారి పేర్లు నమోదు చేసుకోవాలి. ప్రధానోపాధ్యాయులు వారానికోసారి సమీక్ష చేయాలి.

విద్యార్థుల అభివృద్ధి నమోదు చేసుకోవాలి.

ఎస్‌సీఈఆర్‌టీ అధికారుల తనిఖీలో విద్యార్థుల పఠన ప్రగతిని చూపించాలి. పఠనా ప్రగతి సాధించిన పాఠశాలలు, విద్యార్థులు అభ్యాసనా సామర్థ్యాలను సాధించి ఆనందం పొందుతారు.ఈ కార్యక్రమాలను రాష్ట్రస్థాయిలోని ఎస్సీఈఆర్టీ సమగ్ర శిక్ష అధికారులు జిల్లాల్లో మానిటరింగ్ నిర్వహించనున్నారు.

> **విజయవంతం చేయాలి**
>
> 
>
> అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం నుంచి పఠనోత్సవం అమలు కానుంది. ధారాళంగా చదివే విద్యార్థికి చదువులో విషయ అవగాహన మెరుగుపడుతుంది. విజ్ఞానవంతులు కాగలరు. పఠనోత్సవాన్ని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, పర్యవేక్షణ సిబ్బంది పకడ్బందీగా అమలు చేసి విజయవంతం చేయాలి.
>
> – రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి